


నేటి నుంచి మంత్రి బొత్స జిల్లా పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆదివారం నుంచి జిల్లాలో పర్యటించనున్నారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు నగరంలోని భాష్యం స్కూల్ వెనుక సీనియర్ సిటిజన్స్ సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 5.30 గంటలకు 37వ వార్డులో తాగునీటి సరఫరా ట్యాంక్‌ను ప్రారంభిస్తారు. 6.30 గంటలకు ఆర్అండ్‌బి కూడలి నుంచి అయ్యన్న పేట వరకు నూతనంగా నిర్మించిన రోడ్డును ఆర్ అండ్ బి కూడలి వద్ద ప్రారంభిస్తారు. 26న ఉదయం 11 గంటలకు మెరకముడిదాం మండల పరిషత్ కార్యాలయం చేరుకొని మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్షిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు చీపురుపల్లి ఆ కుల పెద్దలతో నిర్వహించే సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు మూడు రోడ్ల కూడలి వద్ద పార్టీ కార్యక్రమంలో పాల్గొంటారు. 6.30 గంటలకు గరికివలస లో గ్రామ సచివాలయం, రైతు కేంద్రం, ఆరోగ్య కేంద్రం భవనాలను ప్రారంభిస్తారు. అదే రోజు రాత్రి విజయవాడ బయలుదేరి వెళ్తారు.



ఉత్కంఠకు తెర

- టిడిపి, జనసేన తొలిజాబితా విడుదల
- తొలివిడతగా 8 మందికి అవకాశం
- నెల్లిమర్ల జనసేనకు కేటాయింపు
- చీపురుపల్లి, ఎస్.కోట, పాలకొండలో తప్పని ఎదురుచూపు

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో మొత్తం 11 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను టిడిపి, జనసేన ఉమ్మడి జాబితాలో ఎనిమిది చోట్ల అభ్యర్థులను ప్రకటించింది. దీంతో, చాలా కాలంగా టిడిపి శ్రేణులు ఎదురు చూస్తున్న ఉత్కంఠకు తెరపడింది. మరో మూడు చోట్ల ఇంకా ఎదురు చూపు కొనసాగుతోంది. విజయనగరం జిల్లా నెల్లిమర్ల స్థానాన్ని జనసేనకు కేటాయించారు.

విజయనగరం జిల్లా



కొండ్రు మురళీమోహన్‌రావు
రాజాం - టిడిపి



లోకం నాగ మాధవి
నెల్లిమర్ల - జనసేన



ఆర్ఎస్‌వికెకె రంగారావు
బొబ్బిలి- టిడిపి



అదితి గజపతిరాజు
విజయనగరం -టిడిపి



కొండపల్లి శ్రీనివాస్
గజపతినగరం -టిడిపి

పార్వతీపురం మన్యం జిల్లా



గుమ్మడి సంధ్యారాణి
సాలూరు - సాలూరు



తోయక జగదీశ్వరి
కురుపాం- టిడిపి



బోనెల విజయచంద్ర
పార్వతీపురం-టిడిపి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం నుంచి మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు కుమార్తె అదితి విజయలక్ష్మి గజపతిరాజుకు మరోసారి అవకాశం కల్పించారు. ఆమె గత ఎన్నికల్లో పోటీచేసి, స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామిపై ఓడిపోయారు. ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్నారు. గజపతినగరం అసెంబ్లీ అభ్యర్థిగా మాజీ ఎంపి కొండపల్లి పైడితల్లి నాయుడు మనుమడు కొండపల్లి శ్రీనివాస్ (కొండపల్లి కొండలరావు కుమారుడు)ను ప్రకటించారు. దీంతో, స్థానిక మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడుకు ఆశాభంగం కలిగింది. బొబ్బిలి నుంచి ఆ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆర్ఎస్‌వికెకె రంగారావు (బేబీ నాయన)ను రంగంలోకి దింపుతున్నారు. ఈసారి మాజీ మంత్రి, బేబీనాయన సోదరుడు ఆర్‌విఎస్‌కె రంగారావు పోటీ నుంచి తప్పుకున్నారు. రాజాం నియోజకవర్గం నుంచి అంతా ఊహించినట్టే మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ పేరును అధిష్టానం ఖరారు చేసింది. నెలిమర్ల నియోజకవర్గం నుంచి జనసేన నాయకులు లోకం మాధవి పేరు ఖరారు కావడంతో అక్కడ టిడిపి తరపున టిక్కెట్ ఆశించిన కర్రోతు బంగార్రాజు ఖంగుతిన్నారు.

పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం నియోజకవర్గం బోనెల విజయ్‌కు, కురుపాం తోయక జగదీశ్వరికి అవకాశం లభించింది. సాలూరు నుంచి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుమ్మడి సంధ్యారాణికి అవకాశం కల్పించారు. విజయనగరం జిల్లాలోని చీపురుపల్లి, ఎస్.కోట, మన్యం జిల్లాలోని పాలకొండ నియోజకవర్గాలకు ఇంకా అభ్యర్థులను ప్రకటించలేదు. దీంతో, ఆయా నియోజకవర్గాల్లోని ఆశావహుల్లో ఇంకా ఉత్కంఠ కొనసాగుతోంది.

మూడు చోట్ల ఎదురు చూపు

చీపురుపల్లి, ఎస్.కోట, పాలకొండ నియోజకవర్గాల్లోని ఆశావహులకు ఎదురు చూపులు తప్పలేదు. ముఖ్యంగా చీపురుపల్లి అసెంబ్లీ అభ్యర్థి ప్రకటన పెండింగ్‌లో ఉండడం, అటు మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుకు కూడా ఎక్కడా సీటు కేటాయించకపోవడంతో ఆయనను చీపురుపల్లి నుంచి రంగంలో దింపాలన్న పార్టీ ఆలోచన మరింత బలపడినట్టుగా కనిపిస్తోంది. ఎస్.కోట అసెంబ్లీ స్థానం కోసం స్థానిక మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పాలకొండలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ, పార్టీ నాయకులు పడాల భూదేవి, గేదెల రవి పేర్లు పరిశీలనలో ఉన్నట్టుగా సమాచారం. వీరిలో పార్టీ నేతలు చంద్రబాబు, లోకేష్ ఆశీస్సులు ఎవరికి ఉంటాయో వేచిచూడాల్సిందే.

టిడిపితో కలిసి ఉమ్మడిగా వెళ్తాం

నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవి

భోగాపురం : టిడిపితో కలిసి ప్రజల్లోకి ఉమ్మడిగా వెళ్తామని నెల్లిమర్ల జనసేన టిడిపి ఉమ్మడి అభ్యర్థి లోకం మాధవి అన్నారు. మండలంలోని ముంజేరు సమీపంలోని మిరాకిల్ సిటీలో శనివారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. పొత్తుల్లో భాగంగా నెల్లిమర్ల టిక్కెటు తనకు కేటాయించిన పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. టిడిపి నాయకులతో కలిసి ఉమ్మడి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి గెలుపునకు కృషి చేస్తామని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసమే తాను పని చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లంట్ల జగదీష్ పాల్గొన్నారు.

సంయమనం పాటించాలి : కర్రోతు

నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా లోకం మాధవిని ప్రకటించిన నేపథ్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందకుండా సంయమనం పాటించాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు కోరారు. శనివారం విజయనగరంలో హోటల్లో ఆయన కార్యకర్తలు, నాయకులతో అత్యవసర సమావేశం ఏర్పాటుచేశారు. రెండు రోజుల్లో పార్టీ అధిష్టానంతో చర్చించాక ఏ నిర్ణయమైనా ప్రకటిస్తామని, అంతవరకూ ఎవరూ ఏమీ మాట్లాడొద్దని సూచించారు

బేబినాయనకు శుభాకాంక్షల వెల్లువ

రామభద్రపురం : టిడిపి బొబ్బిలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయనకు ఆ పార్టీ నాయకులు రామభద్రపురంలో ఘన స్వాగతం పలికారు. గిరిజా రామలింగేశ్వర స్వామి ఆలయ ధ్వజస్తంభం ప్రతిష్టకు హాజరైన ఆయనకు టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామక్రిష్ణ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు, ఎంపిటిసి భవిరెడ్డి చంద్ర, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి చింతల చిన్నమ్మతల్లి, తదితరులు పాల్గొన్నారు.



బేబినాయనకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

పార్టీ పదవులకు కెఎ నాయుడు రాజీనామా



రాజీనామా పత్రాలను చూపిస్తున్న కెఎనాయుడు, నాయకులు

విజయనగరం కోట : గజపతి నగరం నియోజకవర్గ టిడిపి టిక్కెట్‌ను కొండపల్లి శ్రీనివాస్‌కు కేటాయించడాన్ని నిరసిస్తూ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పదవికి, గుంటూరు, మచిలీపట్నం పార్లమెంట్ కో ఆర్డినేటర్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు ప్రకటించారు. ఆయనతో పాటు పలువురు మండల స్థాయి నాయకులు కూడా రాజీనామాలు చేశారు.అయితే పార్టీ కార్యకర్తలుగా కొనసాగుతామని వెల్లడించారు. ఈ మేరకు శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తన అనుచరులతో కలిసి కెఎ నాయుడు మాట్లాడారు. తాను ఏం తప్పు చేశానో అది నాయకులు తెలపాలని కోరారు. నెల రోజుల క్రితం వైసిపి నుంచి టిడిపిలో చేరిన శ్రీనివాస్‌కు టిక్కెట్ కేటాయించడం సరికాదని అన్నారు. ఎన్నికల్లో తాము శ్రీనివాస్‌కు మద్దతుగా పనిచేయలేమని తేల్చి చెప్పారు. చంద్రబాబు పునరాలోచించుకొని నిర్ణయాన్ని మార్చుకోవాలని కోరారు. ఒకటే పార్టీని నమ్ముకొని పార్టీ పట్ల చిత్తశుద్ధితో, అంకిత భావంతో పనిచేసిన కొండపల్లి అప్పలనాయుడుకు టికెట్ కేటాయించాలని ద్వితీయ శ్రేణి నాయకులంతా డిమాండ్ చేశారు. రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన వారిలో బొండపల్లి జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బండారు బాలాజీ, గజపతినగరం మండల నాయకులు అట్టాడ లక్ష్మునాయుడు, గోపాలరాజు, వివి ప్రదీప్‌కుమార్, తదితరులు ఉన్నారు.

అందరినీ కలుపుకొని వెళ్తా

టిడిపి గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్

గంట్యాడ : రానున్న ఎన్నికల్లో అందరినీ కలుపుకొని ముందుకెళ్తానని టిడిపి గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు శనివారం గంట్యాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కీర్తిశేషులు కొండపల్లి పైడితల్లి నాయుడును గుర్తుచేసుకొని తమ కుటుంబానికి మళ్లీ అవకాశాన్ని కల్పించారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీని విజయ పథంలో నడిపిస్తానని వెల్లడించారు. అనంతరం టిడిపి నాయకులు కొండపల్లి కొండలరావు మాట్లాడుతూ వైసిపిని గద్దె దించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అశోక గజపతిరాజు నాయకత్వంలో కె.ఎ.నాయుడును, జనసేన పార్టీని కలుపుకొని ముందుకు సాగుతామని ప్రకటించారు. కార్యక్రమంలో టిడిపి దత్తిరాజేరు మండల అధ్యక్షులు చంద్రశేఖర్, మాజీ ఎంపిపి గంట్యాడ శ్రీదేవి, మాజీ వైస్ ఎంపిపి బొడ్డు రాము పాల్గొన్నారు.

బంగ్లాలో సంబరాలు



అదితికి స్వీట్ తినిపిస్తున్న తండ్రి అశోక్ గజపతిరాజు

విజయనగరం కోట : విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం టిక్కెట్‌ను పూసపాటి అదితిగజపతికి కేటాయించడంతో శనివారం అశోక్‌బంగ్లాలో ఆ పార్టీ శ్రేణులు బాణా సంచా కాల్చి సంబరాలు చేశారు. జాబితా ప్రకటించిన వెంటనే నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకొని అదితి గజపతికి అభినందనలు తెలిపారు. ముందుగా అదితి.. తన తల్లి సునీలాగజపతి, తండ్రి అశోక్ గజపతిరాజు దీవెనలు తీసుకున్నారు. ఆమెకు అశోక్ స్వీటు తినిపించి అభినందనలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తన తండ్రి పూసపాటి అశోక్ గజపతిరాజు వారసురాలుగా రాజకీయాల్లో అడుగు పెట్టినట్లు తెలిపారు. తండ్రి చూపిన బాటలోనే సంక్షేమం అభివృద్ధి రెండు కళ్లుగా విజయనగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తానని తెలిపారు. తమ నాన్న అనుభవాన్ని, సూచనలు సలహాలు తీసుకుంటూ గెలుపునకు అందరినీ కలుపుకుంటూ ముందుకు వెళ్తానని తెలిపారు. గజపతినగరం టిడిపి జనసేన ఉమ్మడి అభ్యర్థిగా కొండపల్లి శ్రీనివాస్‌ను ప్రకటించడంతో.. తన తండ్రి కొండపల్లి కొండబాబుతో కలిసి వచ్చి ముందుగా అశోక్ గజపతిరాజు కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపిరాజు, పట్టణ అధ్యక్షుడు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, విజయనగరం మండల పార్టీ కార్యదర్శి గంటా పోలి నాయుడు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు , విజ్జపు ప్రసాద్ పాల్గొన్నారు.

80 కేంద్రాల్లో నేడు గ్రూప్-2 పరీక్ష

హాజరుకానున్న 26,452 మంది అభ్యర్థులు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో 80 కేంద్రాల్లో ఆదివారం గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్ష జరగనుంది. ఉదయం 10.30 గంటల నుంచి 1 గంట వరకు పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 26,452 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్ష నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. 80 కేంద్రాలకు గాను 24 రూట్లుగా విభజించి 24 మంది జిల్లా అధికారులను రూట్ ఆఫీసర్లుగా నియమించారు. వీరితోపాటు లైజన్ అధికారులుగా తహశీల్దార్లను నియమించారు. పరీక్షా కేంద్రాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటుచేశారు. గ్రూప్-2 పరీక్ష నేపథ్యంలో కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూమ్ నంబరు 08922-236947. దీంతోపాటు సభ్యులు మనోహర్ - 9492763782, బి.సత్యనారాయణ - 9989778912, అనిల్ కుమార్ - 9642336909, పి.శ్రీలక్ష్మి- 8332090249 అందుబాటులో ఉంటారు.

అభ్యర్థులకు సూచనలు

- హాల్ టికెట్‌తోపాటు ఏదైనా ఫొటో గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకెళ్లాలి.
- పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 9.30 గంటల నుంచి 10.15 గంటల వరకు మాత్రమే హాల్ లోనికి అనుమతిస్తారు.
- పరీక్ష హాల్లోకి సెల్‌ఫోన్ గానీ, స్మార్ట్ వాచ్ గానీ, మరే ఎలక్ట్రానిక్ పరికరాలు గానీ తీసుకెళ్లకూడదు.
- పేపర్ పూర్తయిన సరే మధ్యాహ్నం 1 గంట తర్వాతే అభ్యర్థులు బయటకు వెళ్లాలి.
- వికలాంగులకు 40 శాతం పైబడిన వారికి స్క్రైబ్ ను స్వయంగా తీసుకురావచ్చు. లేకుంటే సెంటర్‌లోనే ఏర్పాటు చేస్తారు.

రైతులపై చులకన భావన తగదు

వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి : సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి



మాట్లాడుతున్న సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'రైతులేమైనా ఇంజినీర్లా...' అంటూ జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) నిర్వాసిత రైతులపట్ల చులకనగా, అవహేళనగా మాట్లాడడం తగదని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి అన్నారు. రైతులు కూడా బాగానే ఆలోచించగలుగుతారన్న విషయం జిల్లాలోని వివిధ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ సమయంలో వారు స్పందించిన తీరు, అనంతర అనుభవాలు నిదర్శనమన్నారు. చాలా విషయాల్లో రైతులు చెప్పిన మాటలు కూడా నిజమయ్యాయని వివవరించారు. ముఖ్యంగా తోటపల్లి సాగునీటి ప్రాజెక్టు నిర్మాణంతో 7గ్రామాలు మాత్రమే మునిగిపోతాయని ఇంజినీర్లు చెప్పగా, ఆచరణలో 22 గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని, పెద్దగెడ్డలో కేవలం రెండు గ్రామాలను ముంపు ప్రాంతంగా గుర్తిస్తే 7 గ్రామాలు మునిగిపోయాయని చెప్పారు. ముద్దువలసలోనూ అదే జరిగిందని, తారకరామ తీర్థసాగర్ పరిధిలో ఒక్క గ్రామమే అన్నప్పటికీ, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్నారు. చివరకు పోలవరంలోనూ ఇంజినీరింగ్ అధికారులు చెప్పినదానికి రెట్టింపు స్థాయిలో 300 గ్రామాల వరకు మునిగిపోతున్నాయన్నారు. ప్రభుత్వం, వారి తరపున ఇంజినీర్లు చెప్పింది మాత్రమే నిజం అనుకుంటే ఇన్ని సమస్యలు ఎందుకు ఉత్పన్నమయ్యాయో చెప్పాలని డిమాండ్ చేశారు. అంతమాత్రాన ఇంజినీర్లను తాము తప్పుపట్టడం లేదన్నారు. మితిమీరిన రాజకీయ జోక్యం వల్ల ప్రభుత్వం ఏం చెప్తే అదే ఇంజినీర్లు, చివరకు ఐఎఎస్ అధికారులు కూడా చెప్పేస్తున్నారని అన్నారు. అటువంటి పరిస్థితే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కాలువ అలైన్‌మెంట్ విషయంలోనూ జరుగుతోందని వివరించారు. ప్రభుత్వం తలపెట్టిన అలైన్‌మ్మెంట్ వాస్తవానికి భిన్నంగా ఉందని, అందుకే జిల్లా అభివృద్ధి, రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయం కోరుతున్నామని అన్నారు. జెడ్‌పి చైర్మన్ ఈ జిల్లాలో లేరా? లేక అసలు విషయం తెలియక మాట్లాడుతున్నారా? రాజకీయంగా తనను తాను బలపర్చుకోవడానికి మాట్లాడుతున్నారా? అర్థం కాని పరిస్థితి ఉందన్నారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడడం మంచిదని హితవు పలికారు. ఇప్పటికైనా అలైన్‌మెంట్ మార్పు ప్రతిపాదనపై పున:పరిశీలించాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు బి.రాంబాబు మాట్లాడుతూ రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్ల స్వలాభాల కోసమే ఇష్టారాజ్యాంగా కాలువ అలైన్‌మెంట్ రూపొందించారన్న విషయం ఇప్పటికే రైతులకు బోధపడిందని అన్నారు. ఇప్పటికైనా ఇంజినీరింగ్ నిపుణులతో కమిటీ రూపొందించి ప్రత్యామ్నాయ అలైన్‌మెంట్ కోసం ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పాల్గొన్నారు.

డిసిఎల్ కార్యాలయం వద్ద

మిమ్స్ ఉద్యోగుల బైఠాయింపు



డిసిఎల్ కార్యాలయం ఎదుట బైఠాయించిన మిమ్స్ ఉద్యోగులు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

24 రోజులుగా ఆందోళన చేస్తున్నా స్పందించని మిమ్స్ యాజమాన్యం, కార్మికశాఖ అధికారుల తీరుకు నిరసనగా శనివారం మిమ్స్ ఉద్యోగులు డిసిఎల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ముందుగానే సిఐటియు నాయకులు డిసిఎల్ కార్యాలయం ముట్టడికి పిలుపునివ్వంతో నాయకులను, మిమ్స్ ఉద్యోగులను పోలీసులు గృహ నిర్బంధం, అరెస్టులు చేశారు. మిమ్స్ ఉద్యోగులను అరెస్టు డెంకాడ పోలీసు స్టేషన్‌కు తరలించారు. సిఐటియు నాయకులు టివి రమణను, కె.సురేష్‌ను గృహ నిర్బంధం చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణను అరెస్టు చేశారు. అయినా కొందరు ఉద్యోగులు పోలీసుల నిఘా నుంచి తప్పించుకొని డిసిఎల్ కార్యాలయానికి చేరుకొని బైఠాయించారు. కార్మికశాఖ అధికారులు తమ సమస్యల పరిష్కారానికి చర్చలు నిర్వహించకుండా నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమని అన్నారు. మిమ్స్ యాజమాన్యానికి అధికారులు కొమ్ము కాస్తున్నారని దుయ్యబట్టారు. అధికారులు, యాజమాన్యం వెంటనే స్పందించి వేతన ఒప్పందం చేయాలని, జనవరి నెల వేతనం ఇవ్వాలని,బకాయి ఉన్న ఏడు డి ఎ లు ఇవ్వాలని,కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

నేడు వైసిపి ఆధ్వర్యాన సీనియర్ సిటిజన్ల సమావేశం

విజయనగరం టౌన్ : నగరంలోని భాష్యం స్కూల్ ప్రక్కన ఉన్న మైదానంలో నిర్వహించనున్న సీనియర్ సిటిజన్స్ ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని వైసిపి నాయకులు పిలుపునిచ్చారు. శనివారం సభా స్థలం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ వి.ఎస్ ప్రసాద్, పిన్నింటి సూర్యనారాయణ, లక్ష్మణమూర్తి మాట్లాడుతూ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్ర స్వామి నగర అభివద్ధే ధ్యేయంగా ఐదేళ్లపాటు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దారని అన్నారు. రానున్న ఎన్నికలలో సీనియర్ సిటిజన్స్ ఆశీర్వాదాన్ని కోరుతూ భారీ ఎత్తున ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో మారం బాలబ్రహ్మారెడ్డి, పిన్నింటి చంద్రమౌళి, జి తిరుపతిరావు, శశిభూషణరావు, చిన్నారావు, రాజారెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయ పర్యవేక్షణకు నిఘా అధికారులు

విజయనగరం : ఎన్నికలలో మోడల్ కోడ్ అమలు, మోడల్ కోడ్ ఉల్లంఘన , ఫిర్యాదులు, అభ్యర్థులు, పార్టీల ఎన్నికల వ్యయం తదితర అంశాల పై పర్యవేక్షణ కోసం నియోజకవర్గం వారీగా నిఘా అధికారులను నియమిస్తూ జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి మండలానికి మూడేసి బృందాలను నియమించామని, ఈ బృందం డిప్యూటీ తహశీల్దార్లు ఆధ్వర్యంలో పని చేస్తుందని, ఇందులో పోలీస్ కానిస్టేబుళ్లతో పాటు రెవిన్యూ సిబ్బంది, ఒక వీడియో గ్రాఫర్ ఉంటారని తెలిపారు. మండల రెవిన్యూ అధికారి వారి కార్యాలయం నుండి ఈ బృందాలు పని చేస్తాయని తెలిపారు. ఈ నిఘా బృందాలు వెంటనే సంబంధిత రిటర్నింగ్ అధికారికి రిపోర్ట్ చేయాలనీ, వారిని అధికారులు వెంటనే రిలీవ్ చేయాలని ఆదేశించారు. ఈ బృందాలు ప్రధానంగా చెక్ పోస్టుల వద్ద పని చేస్తూ అక్రమ నగదు రవాణా, అక్రమ మద్యం, ఆయుధాలు, బహుమతుల రవాణా పై దృష్టి పెట్టాలని సూచించారు.

26న కలెక్టరేట్ వద్ద ఆటో డ్రైవర్ల ధర్నా

విజయనగరం టౌన్ : స్టాఫ్ లైన్ వైలేషన్ పేరుతో ఆటో, క్యాబ్‌లపై విధించిన ఈ చలానాలు రద్దు చేయాలని ఈనెల 26న కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్నట్లు ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా కన్వీనర్ ఎ.జగన్మోహన్‌రావు తెలిపారు. శనివారం అంబేద్కర్ జంక్షన్ వద్ద ఉన్న ఆటో స్టాండ్ కార్మికులతో ఆయన మాట్లాడుతూ సరైన బేరాలు లేక ఆటో, క్యాబ్ డ్రైవర్లు ఇబ్బంది పడుతుంటే వారిపై స్టాప్ లైన్ వైలేషన్ పేరుతో ఈ చలానాలు వేయటం దుర్మార్గమన్నారు. ఈ నేపథ్యంలో తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జె.రామారావు, జి.భాస్కరరావు, వై.భాస్కరరావు, బి. ప్రసన్న, వై.ఈశ్వరరావు, పి.ఆనంద్, వై.మోహన్ పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీల్లో ద్వితీయ స్థానం

విజయనగరం టౌన్ : గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరిగిన సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో విజయనగరం జిల్లా బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించింది. ఈ టోర్నమెంట్‌లో మజ్జి పావని టోర్నమెంట్ బెస్ట్ ఆల్‌రౌండ్ అవార్డును ఎమ్మెల్యే అంబటి రాంబాబు చేతుల మీదుగా నగదు బహుమతి అందుకుంది.


డివిజన్ల వారీగా 'జయహో బిసి'

విజయనగరం కోట : నగరంలోని వివిధ ప్రాంతాల్లో జయహో బిసి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బిసి నాయకులు తెలిపారు. శనివారం 1, 2, 3, 4 డివిజన్‌లకు సంబంధించి పూల్‌బాగ్ కోలనీ ఆటో జంక్షన్ వద్ద 'జయహో బిసి సమావేశం నిర్వహించారు. వైసిపి ప్రభుత్వంలో బిసిలకు జరుగుతున్న అన్యాయాలు, వారిపై దాడులు వంటి విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు వేచలపు శ్రీనివాసరావు, కంది మురళినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సుజల ప్రవంతిపై వైసిపి భిన్న స్వరాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఒకే అంశం. సమస్య కూడా ఒక్కటే... ఒకటే పార్టీ.... కానీ, దానిపై భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. అదేదో ప్రతిపక్షమో... లేక మైనార్టీలోవున్న ఇతర పార్టీలో కావు. సాక్షాత్తు అధికార వైసిపి. ఎటొచ్చి సమస్య రైతులకు సంబంధించింది కావడం, అదీ వేలాది మంది రైతుల జీవితాలతోనూ, జిల్లా అభివృద్ధితోనూ ముడిపడి ఉండడంతో జిల్లాలో పబ్లిక్‌టాక్‌గా మారింది. ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు సాగునీరు, తాగునీరు అందించేపేరుతో ఈ జిల్లాలో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కాలువ నిర్మాణానికి భూసేకరణకు సిద్ధపడుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుత కాలువ అలైన్‌మెంట్ వల్ల ఎక్కువ పంట భూములు కోల్పోవడంతోపాటు నిర్వహణ కష్టంగా ఉంటుందని, నీటి పంపిణీలోనూ ఇబ్బందులు తలెత్తుతాయని రైతులు, ఎపి రైతు సంఘం చాలా కాలంగా మొత్తుకుంటున్న సంగతి తెలిసిందే. దీనిపై ఎస్.కోట, గజపతినగరం మండలాల్లో సభలు, సమావేశాలు అనేకం జరిగాయి. ఈనెల 2వ తేదీన ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన జరిగిన భూ నిర్వాసితుల సదస్సుకు ఈ రెండు నియోజకవర్గాల నుంచీ పలువురు తాజా, మాజీ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, రైతులు తరలివచ్చారు. వైసిపి తరపున ఎమ్మెల్సీ రఘురాజు కూడా హాజరైన సంగతి తెలిసిందే. ఇటు రైతులకు, అటు ప్రభుత్వానికి ఖర్చు తగ్గించడంతోపాటు లక్ష్యత ఆయుకట్టుకు నీరు సునాయాశంగా వెళ్లేందుకు వీలుగా కాలువ అలైన్‌మెంట్ ప్రత్యామ్నాయం అన్వేషించాలని, అందుకోసం కలిసికట్టుగా పోరాడాలని ఆ సదస్సు తీర్మానించింది. ఈ డిమాండ్ ముమ్మాటికీ న్యాయమైనదేనని, దీన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, అవసరమైతే చట్ట సభల్లో ప్రస్తావిస్తానని కూడా ఎమ్మెల్సీ రఘురాజు హామీ ఇచ్చారు. నీటివాటం ఇంజినీర్లకన్నా రైతులకు ఎక్కువగా తెలుస్తుందని, ఇంజినీర్లు ఇక్కడ వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా ఎక్కడో కూర్చొని కాలువలు లేదా ప్రాజెక్టుల అలైన్‌మెంట్లు గీసేస్తుంటారని, ఉత్తరాంధ్ర సుజల ప్రసవంతి విషయంలోనూ అటువంటి తప్పిదమే జరిగిందని చెప్పారు. రైతులను ఒప్పించి భూములు తీసు కోవాలి తప్ప, నొప్పించి తీసు కోవడం ఎవరికైనా తగదన్నారు. 'అలైన్ మెంట్ తయారు చేసిన ఇంజి నీర్లకు బహుశా భూముల విలువ, భూములతో రైతులకు ఉన్న అను బంధం గురించి తెలీదేమో' అని విమర్శ కూడా చేశారు. కానీ, నిన్నగాక మొన్న అదే పార్టీకి చెందిన జిల్లా పరిషత్ చైర్మన్, వైసిపి జిల్లా సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ 'రైతులేమైనా ఇంజినీర్లా.... కాలువల ఎలా ఏర్పాటు చేస్తుందో వారికి తెలియడానికి' అంటూ వ్యాఖ్యానించడం చర్చనీయాంశగా మారింది. కాలువల అలైన్‌మెంట్ మార్చే ఆలోచనే లేదంటూ కుండబద్ధలు గొట్టినట్టు చెప్పడంతో రైతులు అగ్గిమీద గుగ్గిలమౌతున్నారు. ప్రస్తుత అలైన్‌మెంట్ ప్రకారం తాటిపూడి నుంచి గజపతినగరం, గుర్ల మండలాల మీదుగా సాగుతుంది. దీనికి పైన ఉన్న మెంటాడ, దత్తిరాజేరు, రామభద్రపురం, తెర్లాం, మెరకముడిదాం, బాడంగి, బలిజిపేట, బొబ్బిలి, రాజాం తదితర మండలాలకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని పంపాల్సి వస్తుంది. అదే మెంటాడ, రామభద్రపురం, బొబ్బిలి, బలిజిపేట మీదుగా అలైన్‌మెంట్ మార్పుచేస్తే భూదేవి జలాశయం నుంచి చిలకలగెడ్డ ఆంధ్ర జలాశయం, చంపావతి, వేగావతి, ఏడొంపులగెడ్డ, పోతులగెడ్డ తదితర నదులు, గెడ్డలను అనుసంధానం చేయవచ్చు. తద్వారా నిర్ధేశిత ఆయుకట్టుకు పూర్తిస్థాయిలో నీరందించవచ్చు. ఆయుకట్టు ప్రాంతంలో 90శాతం భూమి దిగు భాగాన ఉండడం వల్ల లిఫ్టల సంఖ్య, కాలువల నిర్మాణాకి ఖర్చు తగ్గుతుందని రైతులు, వారి తరపున సీనియర్ ఇంజినీరింగ్ నిపుణులు ఐఎస్ఎన్ రాజు తదితరులు చాలా కాలంగా చెబుతున్నారు. ఈ విషయమై సాగునీటి పారుదలశాఖ అధికారులు, ఆ శాఖకు చెందిన రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు, జిల్లాకు చెందిన బొత్స సత్యనారాయణలతో ఎపి రైతు సంఘం నాయకత్వంలో రైతులు చర్చించగా, వాస్తవ పరిస్థితులు తెలుసుకునేందుకు ఒక ప్రత్యేక కమిటీ కూడా వేసినట్టు సమాచారం. దానిపై చిత్తశుద్ధి మాత్రం కనింపించకపోవడంతో రైతులు సంఘటితమౌతున్నారు. ఈ సమస్య జిల్లాకు చెందిన నాయకులకు చాలా చిన్నదిగాను, పట్టీపట్టనట్టుగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం బడా కాంట్రాక్టర్లకు లాభాలు చేకూర్చేవిధంగా కాలువ అలైన్‌మెంట్ చేస్తే... జిల్లాకు చెందిన నాయకులు అచేతనంగా వ్యవహరించడం సిగ్గుచేటనే చర్చ జిల్లాలో సర్వత్రా సాగుతోంది. ఎన్నికల ముందే ఇలా మాట్లాడితే... ఎన్నికలు అయ్యాక అసలు పట్టించుకునే పరిస్థితి కూడా ఉండబోదని రైతుల్లో చర్చనడుస్తోంది.





సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్

రెడ్‌క్రాస్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం కోట

రెడ్‌క్రాస్ సర్వ సభ్య సమావేశాన్ని శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జెసి కార్తీక్ అధ్యక్షతన నిర్వహించారు. గత సంవత్సరంలో చేసిన నిర్ణయాలపై సమీక్షించారు. సంస్థ చేపట్టే కార్యక్రమాలపై సభ్యులు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, రెడ్‌క్రాస్ చైర్మన్ కెఆర్‌డి ప్రసాదరావు, జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.ఎస్. కుమార్, వైస్ చైర్మన్ ఆర్.రాజగోపాల్ నాయుడు, కార్యదర్శి కె.సత్యం, కోశాధికారి టి.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌తోనే అభివృద్ధి


ప్రజాశక్తి-కొత్తవలస

సైన్స్‌తోనే అభివృద్ధి సాధ్యమని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయచందర్ తెలిపారు. శనివారం స్థానిక రవీంద్ర భారతి పాఠశాలలో సైన్స్ ఎక్స్‌పో సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఎక్స్‌పోను జడ్జి ప్రారంభించారు. ఆయనతోపాటు తహశీల్దార్ చంద్రశేఖర్‌రావు ప్రాజెక్టులను పరిశీలించి, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వెటర్నరీ ఎడి బి.గంగాధర్ రావు, డిప్యూటీ తహశీల్దార్ టి. రమేష్, పాఠశాల చైర్మన్ ఎంఎస్ మణి, నార్త్ ఆంధ్ర జోనల్ ఇన్‌ఛార్జి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ నిషాకుమారి, డి.సంతోష్‌కుమార్, డిప్ శివ పాల్గొన్నారు.

ఘనంగా సీతగుండం జాతర

ప్రజాశక్తి-రామభద్రపురం

మండల పరిధిలోని పాడివానివలస శివారులో శనివారం సీత గుండం వద్ద ఘనంగా జాతర నిర్వహించారు. ఇక్కడ ప్రతి ఏటా మాఘ పౌర్ణమి సందర్భంగా జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సీత గుండం నుంచి నిత్యం నీటిధారలు వస్తుంటాయి. వేసవిలో చుట్టూ ఉన్న చెరువులు, బావులు ఎండి పోయినా ఈ గుండంలో మాత్రం నీరు జాలువారడం ఇక్కడి ప్రత్యేకత. జాతరకు ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



సిఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అప్పలనర్సయ్య

సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి-గజపతినగరం

సీతారాంపురం గ్రామానికి చెందిన మారోతు హేమంత్ కుమార్ బ్రెయిన్ సర్జరీ చేయించుకోవడంతో ఆయనకు సిఎం సహాయనిధి నుంచి రూ.2.50 లక్షలు మంజూరైంది. ఈ మేరకు శనివారం బాధితుడికి చెక్కును ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గార తౌడు, వైసిపి మండల అధ్యక్షులు బోడి వెంకటరమణ, నాయకులు బెల్లాన త్రినాథరావు, మాజీ సర్పంచ్ దాసరి జగన్నాథం, ఎన్.గురునాయుడు, జనార్దన్‌రావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం మార్పు అపోహ

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని అప్పాపురం 74వ పోలింగ్ కేంద్రం మార్పు అపోహ మాత్రమేనని స్థానిక సర్పంచ్ కరణం నిర్మల శనివారం స్పష్టం చేశారు. శనివారం ప్రజాశక్తిలో పోలింగ్ కేంద్రం మార్పు వద్దంటూ వచ్చిన వార్తకు సర్పంచ్, తహశీల్దార్ రాములమ్మ స్పందించారు. పోలింగ్ కేంద్రం శిథిలావస్థలో ఉందన్న అనుమానంతో మార్చాలనుకున్నామని అన్నారు. గ్రామస్తులు నిర్ణయం మేరకు పోలింగ్ కేంద్రం మార్పు చేయడంలేదని చెప్పారు. ఈ పోలింగ్ కేంద్రం మార్పు కోసం పంచాయతీ అనుమతి కోరగా అందుకు నిరాకారించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రం మార్పుకు సంబంధించి తహశీల్దార్ ప్రజలు అభిప్రాయం మాత్రమే కోరారని, గ్రామ పంచాయతీ, ప్రజలు అంగీకారం తెలపలేదని స్పష్టం చేశారు. ఈ విషయంపై తహశీల్దార్ రాములమ్మకు వివరణ కోరగా పోలింగ్ కేంద్రం మార్చలేదని అన్నారు.

బేబినాయన విజయం నల్లేరుపై నడకే

ప్రజాశక్తి-రామభద్రపురం

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా బేబినాయనను ప్రకటించడంతో ఆయన గెలుపు నల్లేరుపై నడకేనని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతిరావు ధీమా వ్యక్తంచేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలే టిడిపి గెలుపునకు శ్రీరామ రక్ష అన్నారు. ఇప్పటికే వీటిపై విస్తృత చర్చ నడుస్తోందని చెప్పారు. దీనికి జనసేనతో పొత్తు కూడా తోడవడంతో మరింత బలం చేకూరిందన్నారు. గత ఐదేళ్లుగా అత్యంత దుర్మార్గ పాలన నడుస్తోందని తెలిపారు. జగన్‌పై వ్యతిరేకత అన్ని వర్గాల ప్రజల నుంచి తీవ్రంగా ఉందని చెప్పారు. సమావేశంలో నాయకులు మడక పాపారావు, సత్యం పాల్గొన్నారు.

ఘనంగా పివిజి రాజు శతజయంతి

ప్రజాశక్తి- డెంకాడ

విజయనగరం రాజా సాహెబ్ డాక్టర్ పివిజి రాజు శత జయంతి ఉత్సవాలు శనివారం ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ పివిజి రాజు స్మారక ప్రసంగాన్ని నిర్వహించారు. పి.వి.జి రాజు జీవితం, ఆయన విజన్, గొప్పతనం సమాజానికి చేసిన కృషిపై ఎంవిజిఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.ఎస్. సీతారామరాజు వివరించారు. అధ్యాపకులందరూ ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని, ఆయన స్థాపించి, ఆయన ఆశయాలతో నడుస్తున్న బహుళ-సంస్థలకు మరింత పేరు ప్రతిష్టలు తెచ్చిపెట్టేలా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాన్సాస్ కరస్పాండెంట్ డాక్టర్ కె.వి.ఎల్ రాజు, ప్రిన్సిపాల్స్ డాక్టర్ వై.ఎం.సి శేఖర్, వైస్ ప్రిన్సిపల్ ఎస్ మోహన్ కుమార్, డీన్లు, అద్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరుదైన బాంబే బ్లడ్ దానం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సొంగ దేవికి గైనిక్ సర్జరీ నిమిత్తం అత్యంత అరుదైన రక్త వర్గం బాంబే బ్లడ్ అవసరమైంది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు జరజాపుపేట సాధన యువజన సంఘం సభ్యులను సంప్రదించారు. దీంతో అధ్యక్షులు పోలుభోతు దుర్గాప్రసాద్ రావు, ప్రధాన కార్యదర్శి పసుమర్తి వెంకటరమణ ఇరువురు కలిసి అరుదైన రక్త వర్గానికి చెందిన సాధన సభ్యులు హెచ్ లీలాప్రసాద్‌కి సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన లీలా ప్రసాద్ విజయనగరం ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంక్‌లో రక్త దానం చేసి రోగికి పంపించారు. ఈ సందర్భంగా దాతను ఎన్‌విఎన్ నిర్వాహకులు నాగేశ్వరరావు, పి.వెంకటరమణ, రాగోలు వినయ్ సత్కరించారు. అత్యవసర పరిస్థితుల్లో రక్త దాత నేటికీ 4వ సారి రక్తదానం చేసి ఆదుకున్నాడని పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అభినందించారు.



రక్తదాతను అభినందిస్తున్న ఎన్‌విఎన్ బ్లడ్‌బ్యాంకు నిర్వాహకులు

నాగార్జున భవితవ్యమేమిటో?

- చీపురుపల్లి నుంచి గంటాను ప్రతిపాదించడంతో ఆసక్తికరమైన చర్చ
- ఎంపీ అభ్యర్థిగా కిమిడిని ప్రకటించవచ్చనే ఊహాగానాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

టిడిపి విజయనగరం పార్లమెంట్ స్థానం అభ్యర్థులు, చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున భవితవ్యంపై సర్వత్రా ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. మంత్రి బొత్స సత్యనారాయణను ఢీకొట్టడం ద్వారా ఎన్నికల్లో ఆయన ప్రభావ వర్గం ఇతర నియోజకవర్గాలపై పెద్దగా లేకుండా కట్టడిచేసేందుకు టిడిపి ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. ఇందుకు తగ్గట్టే టిడిపి - జనసేన ఉమ్మడి తొలి జాబితాలో చీపురుపల్లి అభ్యర్థిని ప్రకటించలేదు. మరోవైపు ఇక్కడి నుంచి పోటీకి దింపుతారనుకుంటున్న గంటాకు కూడా మరెక్కడా సీటు కేటాయించలేదు. దీంతో, గంటాకు చీపురుపల్లి సీటును ఖరారు చేయాలన్న పార్టీ ఆలోచన మరింత బలపడినట్టుగా తెలుస్తోంది. అయితే, నాగార్జునకు విజయనగరం పార్లమెంట్ స్థానం లేదా అందుకు తగ్గ హామీ ఇచ్చాక గంటా పేరును ఖరారు చేసే ఆలోచనలో పార్టీ ఉన్నట్టుగా తెలుస్తోంది. ఈ పరిణామాలు నాగార్జునను ఒకింత విస్మయానికి గురిచేశాయి. దీంతో, రెండు మూడు రోజులుగా పార్టీ కేడర్‌కు అందుబాటులో లేరని, విజయవాడలో మకాంవేసి, చీపురుపల్లి అసెంబ్లీ సీటు కోసం పార్టీవద్ద తనవంతు వాదనను వినిపిస్తూ ప్రయత్నాలు చేసుకుంటున్నారని సమాచారం. వాస్తవానికి 2019 ఎన్నికల్లో ఓటమి తరువాత నాగార్జున నియోజక వర్గాన్ని మరింతగా అంటిపెట్టుకుని ఉన్నారు. జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాలతో పోలిస్తే ఆర్‌ఇసిఎస్ ప్రైవేటీకరణ తదితర స్థానిక సమస్యలపైనా, రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహించడంలో ముందంజలోనే ఉన్నారు. దీంతో, సీటు కూడా తప్పక వస్తుందని ఆశగా ఎదురు చూశారు. కానీ, మంత్రి బొత్సను భయపెట్టేందుకు నాగార్జున సరిపోరనే ఆలోచనతో గంటా పేరును అనూహ్యంగా తెరపైకి తేవడం చర్చనీయాంశంగా మారింది. ఈనేపథ్యంలో గంటాకు ఉన్న బలమేమిటి? నాగార్జునకు లేని బల మేమిటి? అన్న కోణంలో జనం చర్చించుకుంటున్నారు. నియోజకవర్గంలోని నాగార్జున అభిమానులు, ముఖ్య అనుచరుల్లో గందరగోళం నెలకొంది. బొత్సను ఓడించడానికి ఎక్కడి నుంచో వలస నాయకులను తేవాల్సిన అవసరం లేదని కూడా చెబుతున్నారు. ఆర్థికంగా బలం ఉంటేనే గెలుస్తామనుకోవడం అధిష్టానం తప్పుడు ఆలోచనేనని, దానికన్నా జనంతో మమేకమై పనిచేసిన వారినే ఓటర్లు విశ్వసిస్తారని వ్యాఖ్యానిస్తున్నారు. మరోవైపు మంత్రి బొత్సపై గంటా శ్రీనివాసరావు పోటీకి తలపడక పోవచ్చని, అంతపెద్ద గెలుపు గుర్రంగా భావిస్తున్న బొత్సపై పోటీచేస్తే తాను మాత్రమే గెలుస్తానని ఎలా నమ్ముతారని అంటున్నారు. గంటా కూడా ఇందుకు తగ్గట్టే ప్రకటన చేశారు. తాను ఇంత వరకు పోటీచేసిన చోట రెండోసారి పోటీచేయక పోయినప్పటికీ, అది ఉమ్మడి విశాఖ జిల్లాలో మాత్రమే జరిగిందని, అందుకే సాధ్యాసాధ్యాలను ఆలోచిస్తున్నానని కూడా మెలిక పెట్టారు. గంటాకు టిడిపి అధిష్టానం మరో ప్రత్యామ్నాయం ఇవ్వకపోతే చీపురుపల్లిలో బొత్సపై పోటీచేయక తప్పదనే విశ్లేషణలు కూడా వినిపిస్తున్నాయి. గతంలో గంటా ఎక్కడ కోరుకుంటే అక్కడే పార్టీ సీటు కేటాయించేదని, ప్రస్తుత పరిస్థితుల్లో కోరుకున్న స్థానాన్ని కేటాయించే పరిస్థితి ఆ పార్టీలో లేదనే వాదన కూడా వినిపిస్తోంది. అనివార్యంగా గంటా చీపురుపల్లి వస్తే నాగార్జునకు విజయనగరం పార్లమెంట్ స్థానం కట్టబెట్టవచ్చని రాజకీయ నాయకులు విశ్లేషిస్తున్నారు. కొన్నాళ్ల క్రితమే నాగార్జునను ఎంపీగా పోటీచేయాలని పార్టీ కోరినట్టు, ఆయన సున్నితంగా తిరస్కరించినట్టు కూడా చర్చనడుస్తోంది. భవిష్యత్తు పరిణామాలు ఏ విధంగా ఉంటాయో వేచి చూడాల్సిందే.



అన్ని రంగాల్లో అభివృద్ధి : ఎంపి

ప్రజాశక్తి- డెంకాడ

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అభివృద్ధి చేశారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంపి బెల్లాన చంద్రశేఖర రావు అన్నారు. మండలంలోని రఘుమండ, బొడ్డవలసలో నూతనంగా నిర్మించిన సచివాలయాలను, బిటి రోడ్లను ఇంటింటికి కుళాయిలను వారు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో సిఎం జగన్మోహన్ రెడ్డి ఈ నాలుగున్నర ఏళ్ల కాలంలో ఎంతో కృషి చేశారని తెలిపారు. వాలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి ప్రజలకు సేవ చేస్తున్నామని గ్రామంలోనే సచివాలయం ఏర్పాటు చేసి సేవలు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్ బాబు, ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మి నాయుడు, డెంకాడ పిఎసిఎస్ చైర్మన్ రొంగలి కనక సింహాచలం, తహశీల్దార్ రామారావు, ఎంపిడిఒ లవరాజు, ఇఒపిఆర్‌డి శంకర్ జగన్నాథం, రఘుమండ, బొడ్డవలస సర్పంచులు గూడేల విష్ణు, ఎర్ర సన్యాసమ్మ, నాయకులు కోరాడ కోటినాయుడు, బమ్మిడి వెంకటరమణ, లంక లక్ష్మణరావు, తోరోతు త్రిమూర్తులు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపి, ఎమ్మెల్యే

సంక్షేమ బోర్డును సమర్ధవంతంగా నిర్వహించాలి

28, 29 తేదీల్లో భవన నిర్మాణ కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును సమర్ధవంతంగా నిర్వహించాలని ఈ నెల 28, 29 తేదీల్లో అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నటుల ఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి.రమణ తెలిపారు. శనివారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీక్షల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం పని చేయాల్సిన ప్రభుత్వం ఆ పని చేయడం లేదన్నారు. కార్మికుల సెస్ ద్వారా బోర్డులో ఉన్న రూ.2 వేల కోట్లను ప్రభుత్వం ఇతర అవసరాలకు దారి మళ్లించి, కార్మిక సంక్షేమానికి తూట్లు పొడిచిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. జిఒ 12, 13 ను విడుదల చేసి పని లేకుండా చేసిందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు చేపడుతున్న దీక్షలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ నాయకులు కంది త్రినాథరావు, ఎన్.కృష్ణారావు, రాజు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ 'ఉపాధి' కల్పించాలి

ప్రజాశక్తి-గంట్యాడ

జాబు కార్డు ఉన్న ప్రతి కూలీకి పని కల్పించి మండలానికి మంచి పేరు తేవాలని ఎంపిపి పి.హైమావతి ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. శనివారం గంట్యాడలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ ఆయా గ్రామ పంచాయతీల్లో జాబ్‌కార్డు ఉన్న కూలీకి 100 రోజులు పనిని కల్పించి, పేదరికాన్ని నిర్మూలించాలని అన్నారు, డ్వామా పీడీ ఉమా పరమేశ్వరి మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు సక్రమంగా పని చేయలేదని, ఏ పంచాయతీలోనూ వంద రోజులు పని దినాలు పూర్తి చేయలేదని మండిపడ్డారు. ఉపాధి హామీ పనులను కూలీలకు సక్రమంగా కల్పించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మండలంలో పనితీరు బాగోలేదని, ఎంపిడిఒ భవాని, ఎపిఒ సుందరరావు స్పందించి చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండు పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లకు మెమోలు జారీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎపిడి శారదా దేవి, అంబుడ్స్‌మేన్ అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్‌లో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఉచిత వైద్య శిబిరం విద్యార్థులకు, అధ్యాపక సిబ్బందికి ఎంతో దోహదపడుతుందని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి అన్నారు. శనివారం విశ్వవిద్యాలయంలో తిరుమల మెడికవర్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 99 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్.సాయికిరణ్, డాక్టర్ ఎస్ఎన్ అభిప్రీతి పలువురికి ఆరోగ్య పరీక్షలు జరిపారు. రిజిస్ట్రార్ డాక్టర్ పి.పల్లవి, డీన్ ప్రొఫెసర్ ఎం.ఎల్.ఎన్.ఆచార్యులు, డీన్ డాక్టర్ సన్నీడియోల్, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, రోటరీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ కృష్ణశాంతి, కోశాధికారి ప్రవీణ్ కుమార్, డాక్టర్ బి.రాధికారాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ధ్రువపత్రాలను అందజేశారు.

ఉచిత నేత్ర పరీక్షలు

డాక్టర్ మంచు కుమారస్వామి ఆసుపత్రి నుంచి వచ్చిన సిబ్బంది విశ్వవిద్యాలయంలోని అధ్యాపకులకు నేత్ర పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో 132 మంది నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. బాబ్జి, ఆప్టొమెట్రిస్ట్ పి.రమేష్ సేవలందించారు.

శారదా కంపెనీ ఆధ్వర్యాన

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను శారదా పరిశ్రమ ఆధ్వర్యాన నిర్వహిస్తున్నారు. శనివారం ఈ పోటీలను సిఐ చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక వికాసం పెంపొందించడానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా కంపెనీ సీనియర్ మేనేజర్ ప్రభాత్ మోహన్ మాట్లాడుతూ యువతను ప్రోత్సహించడమే కాక కంపెనీ జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడలకు ప్రోత్సాహం అందిస్తుందని చెప్పారు. విజేతకు రూ.1.25 లక్షలు, రన్నర్‌కు రూ.60 వేలు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన వారికి రూ.30 వేలు, రూ.25 వేలు నగదు బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శారద పరిశ్రమ డిజిఎం సన్యాసిరావు, కొత్తవలస, కంటకాపల్లి, కాటకాపల్లి సర్పంచులు మచ్చ ఎర్రయ్య రామస్వామి, మదిన అప్పల రామ్, పీతల కృష్ణ, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, పారిశ్రామికవేత్త ఎం.తాత, హైస్కూల్ హెచ్‌ఎం. సిహెచ్ ఈశ్వరరావు, పిఎస్ఎన్ పాత్రుడు, వాలీబాల్ జాతీయ కోచ్ సూరిబాబు, మెంబర్ ఆఫ్ సెలక్షన్ కమిటీ కృష్ణంరాజు పాల్గొన్నారు.



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

యువత భవిష్యత్తు అంధకారం

ప్రజాశక్తి-విజయనగరం కోట

నూతన పరిశ్రమలు స్థాపించక పోవడంతో యువత భవిష్యత్తు అంధకారమైందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతిరాజు అన్నారు. శనివారం అశోక్ బంగ్లాలో మై ఫస్ట్ ఓట్ ఫర్ సిబిఎన్ కార్యక్రమం కరపత్రాన్ని ఆమె ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ మై ఫస్ట్ ఓట్ ఫర్ సిబిఎన్ కార్యక్రమం ద్వారా నూతనంగా ఓటు హక్కు పొందిన యువత ప్రతిఒక్కరినీ కలవాలని చెప్పారు. ప్రస్తుతం యువత ఎదుర్కొంటున్న సమస్యల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఎంత అవసరమో తెలియజేయాలని కోరారు. టిడిపి నాయకులు ఐవిపి రాజు, పి.లక్ష్మీ వరప్రసాద్, గంటా పోలినాయుడు, పిల్లా విజయ్ కుమార్, అవనాపు విజయ్ పాల్గొన్నారు.

పాఠశాలను బాలల హక్కుల కమిషన్ సందర్శన

ప్రజాశక్తి -పూసపాటి రేగ

జిల్లా పర్యటనలో ఉన్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాంలు పూసపాటి రేగ కెజిబివి కేంద్రాన్ని, స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలను శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఇరు పాఠశాలల్లో ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు, పరీక్షా సమయాలలో ఒత్తిడి లేని పద్ధతులు, ఆరోగ్య సూత్రాలు ఎలా పాటిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాలలో ఏర్పాటు చేస్తున్న మౌలిక సదుపాయాలు గురుంచి ఆరా తీశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా ఉండాలనే లక్ష్యంతో అన్ని జిల్లాల్లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సారథ్యంలో మానసిక తత్వవేత్తలు, వ్యక్తిత్వ వికాస నిపుణులు, సమాజ ప్రభావిత ఔన్నత్యం గల ప్రముఖులతో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అనంతరం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థుల అభిప్రాయాలను సేకరించారు. ఈ అంశాలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాలల హక్కుల పరిరక్షణకు, సంక్షేమానికి విఘాతం కలగకుండా చూస్తామని అన్నారు. ఈ సందర్శనలో పూసపాటి రేగ తహశీల్దార్ కె.ప్రవల్లిక ప్రియ, జెడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శంకర రావు, కెజిబివి ప్రిన్సిపాల్ భారతి, గ్రామ సచివాలయ మహిళా సంరక్షణకార్యదర్శులు, సంక్షేమ కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న కేసలి అప్పారావు

సాంకేతికత అన్ని రంగాలకూ మూలం

ప్రజాశక్తి- డెంకాడ

టెలి కమ్యూనికేషన్ సాంకేతికత అన్ని రంగాలకూ మూలమని బిఎస్ఎన్ఎల్ డిప్యూటీ మేనేజర్ డాక్టర్ ఎం.సత్య ప్రసాద్ అన్నారు. లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం, బిఎస్ఎన్ఎల్ మధ్య శనివారం అవగాహన ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా ఎం.సత్య ప్రసాద్, సిహెచ్ వరప్రసాద్, బిఎస్ఎన్ఎల్ గ్రీన్ జిటిఐ ట్రైనింగ్ కోఆర్డినేటర్ బి.ఎస్ శ్రీనివాస రావు పాల్గొని మాట్లాడారు. ఇసిఇ విభాగాధిపతి డి. ఎం.రాజన్‌బాబు మాట్లాడుతూ టెలీకమ్యూనికేషన్ రంగంలో ఆవిష్కరణలను పెంపొందించడానికి ఈ అవగాహన పత్రం కింద చేపట్టబోతున్న పలు కార్యక్రమాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి రామరెడ్డి మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం విద్యార్థుల ఉన్నతికి పలు కార్యక్రమాలని, అవగాహన ఒప్పందాలని చేస్తుందన్నారు.



విజయగౌరికి నోటీసు అందజేస్తున్న పోలీసులు

చలో విజయవాడ'కు వెళ్లవద్దని

యుటిఎఫ్ నాయకులకు నోటీసులు

బొబ్బిలి : ఒపిఎస్‌ను పునరుద్ధరించి, బకాయిలు చెల్లించాలని కోరుతూ ఈ నెల 27న ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జెఎసి చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లవద్దని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, జిల్లా నాయకులు ప్రసన్నకుమార్‌కు శనివారం పోలీసులు నోటీసులు ఇచ్చారు. రామభద్రపురం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విజయగౌరికి, ముచ్చర్లవలస ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రసన్నకుమార్‌కు నోటీసులు ఇచ్చారు. ఉద్యమాలపై నిర్బంధాలు దుర్మార్గమని యుటిఎఫ్ నాయకులు విజయగౌరి, ప్రసన్నకుమార్ అన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు గడువు పెంపు

వేపాడ : మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో 5వ తరగతి, ఇంటర్ ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 28 వరకు గడువు పెంచినట్లు ప్రిన్సిపల్ టి.ఎం.ఫ్లోరెన్స్ తెలిపారు. 5వ తరగతిలో 80 సీట్లు, ఇంటర్ ఎంపిసి- 40, బైపిసి- 40 సీట్లు ఉన్నాయని చెప్పారు. మార్చి 10న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఐదో తరగతి ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు. అదేరోజు మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఇంటర్ ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. వివరాలకు 8985883015 ను సంప్రదించాలని కోరారు.

ఘనంగా విజయ దుర్గాంబికా ప్రతిష్ట

ప్రజాశక్తి- మెరక ముడిదాం

మండలంలోని గర్భాం కొత్త వీధి, బైరిపురం బస్టాండ్ సమీపంలో నూతనంగా నిర్మించిన విజయ దుర్గాంబికా ఆలయ మహోత్సవాలు గత మూడు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. విజయ గణపతి, సుబ్రహ్మణ్యం స్వామి, విజయ దుర్గాంబికా పూజా కార్యక్రమాలను ఆరవిల్లి మురారిబాబు ఆధ్వర్యంలో ఆలయ ధర్మ కర్తలు తాడేలా వెంకటరమణ, మంగమ్మ దంపతులు నిర్వహించారు. శనివారం జరిగిన అమ్మవారి ప్రతిష్ట మహోత్సవంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాలొన్నారు. కార్యక్రమంలో ఎంపిపి తాడ్డి కృష్ణవేణి, తాడ్డి వేణుగోపాలరావు, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఎస్‌వి రమణరాజు, వైసిపి మండల అధ్యక్షులు కోట్ల వెంకటరావు, బైరిపురం సర్పంచ్, ఉప సర్పంచ్ పప్పల విజయ కుమారి, పప్పల కృష్ణమూర్తి, బూర్లె నరేష్ కుమార్, కర్రోతు నాగేశ్వరరావు, సబ్బి శెట్టి వెంకట సత్యనారాయణ, సత్యవరపు చినబాబు తదితరులు పాల్గొన్నారు.

జెసి రాజుకు సత్కారం

బొబ్బిలి : సామాజిక కార్యక్రమాలు చేస్తూ పేదలకు అండగా నిలుస్తున్న రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజును ఆ క్లబ్ సభ్యులు సత్కరించారు. గత ఎనిమిదేళ్లుగా రోటరీ క్లబ్‌లో బాధ్యతలు నిర్వర్తించి అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టడంతో రోటరీ క్లబ్ అంతర్జాతీయ సంస్థ రొటేరియన్ పాల్ హారిస్ పెలో పురస్కారాన్ని అందించారు. దీంతో సూర్య రెసిడెన్సీలో రోటరీ కార్యదర్శి వారాణాసి శ్రీహరి, కోశాధికారి ఎస్.శ్రీనివాస్, ఇతర సభ్యులు జెసి రాజును సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు రామకృష్ణ, ఎస్.అప్పలరాజు, నాగరాజు, ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాధితుల చెంతకు సెల్‌ఫోన్లు

విజయనగరంకోట :పోగొట్టుకున్న 15 మొబైల్స్‌ను సోషల్ మీడియా సైబర్ సెల్ సిఐ టి.వి.విజయ కుమార్.. శనివారం బాధితులకు అందజేశారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న 15 మొబైల్స్‌ను వారం రోజుల్లోనే ట్రేస్ చేసి, స్వాధీనం చేసుకున్నట్లు సిఐ విజయకుమార్ తెలిపారు. సైబర్ క్రైం పోలీసుస్టేషను వద్ద బాధితులకు వాటిని అందజేశారు. కార్యక్రమంలో సైబర్ సెల్ ఎస్ఐలు ప్రశాంత కుమార్, నజీమా బేగం, సైబర్ సెల్ కానిస్టేబుళ్లు వాసుదేవ్, శ్రీనివాసరావు, రాజేష్, నాగమణి, శిరీషా, తదితరులు పాల్గొన్నారు.